## క్లుప్తంగా

### జగన్ మామయ్యకు కృతజ్ఞతలు



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అమలు చేస్తున్న జగనన్న అమ్మఒడి పథకం విద్యార్థులకు వరం అని హెడ్‌మాస్టర్ గుణంపల్లి వాసుదేవరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి హైస్కూల్‌లో విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అమ్మఒడి పథకం ద్వారా జగనన్న పేదవిద్యార్థుల పాలిట పెన్నిది అన్నారు. ప్రతి విద్యార్థి చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్న సంకల్పంతో జగనన్న అమ్మ ఒడి పథకం అమలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

### పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించండి

కొత్తపల్లి: పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. స్థానిక కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రేష్మ ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఏఏ గ్రామాలలో ఎంతమంది రైతులు పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారన్నా విషయాలపై సమీక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 12 మంది రైతులకు 169 ఎకరాలలో సాగుచేసేందుకు అనుమతులు వాచ్చయన్నారు. ఇందులో 25 ఎకరాలలో సాగుచేసేందుకు పనులు ప్రారంభించారని చెప్పారు. ఇంకా ఎవరైనా రైతులు పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం

నందికొట్కూరు: పట్టణంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తోందని 20వ వార్డు కౌన్సిలరు షేక్ అబ్దుల్ హామీద్ అన్నారు. బుధవారం పట్టణంలోని 20వ వార్డులోని వీధుల్లో సీసీ రోడ్డు నిర్మాణాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గడప గడపలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. తమ వార్డుకు ప్రభుత్వం గడప గడప నిధులు రూ. 8 లక్షలు విడుదల అయ్యాయని చెప్పారు. ఈ నిధులతో వీధులలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను చేయించి ప్రజలకు ఇబ్బందులకు లేకుండా చేస్తున్నామన్నారు.

### స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

జూపాడుబంగ్లా: పొదుపు మహిళలు స్వయం ఉపాధిరంగాల్లో రాణించాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం అంబమ్మ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పొదుపు మహిళలకు స్వయం ఉపాధిరంగాల్లో రాణింపు, కుటీర పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంక్షేమం కోసం పలు పథకాలను మంజూరు చేస్తున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవటం ద్వారా మహిళలు సామాజిక, ఆర్థిక రంగాల్లో రాణించాలని సూచించారు. కుటీర పరిశ్రమల స్థాపనకు ఒక్కో మహిళకు 35శాతం రాయితీతో రూ.లక్ష మేర రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ అధికారిణి తేజస్విని, డీఆర్పీ మనోజ్, అకౌంటెంటు రమేష్, సీసీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

### ధ్రువపత్రాల పరిశీలన

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామ సచివాలయం వద్ద బుధవారం నీటి ముంపు నిర్వాసితుల ధ్రువపత్రాలను డిప్యూటీ తహసీల్దార్లు రాధ, విజయలక్ష్మి పరిశీలించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ కింద భూములు, కట్టడాలు కోల్పోయిన నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం చెక్కులను పంపిణీ చేసేందుకు లబ్ధిదారులకు వెరిఫికేషన్ చేయించుకోవాలని ఈనెల 17న నోటీసు జారీ చేశారు. అందులో భాగంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ల్యాండ్) ఆదేశాల మేరకు నోటీసుదారులు సమర్పించిన సర్టిఫికెట్లను పరిశీలించి వారి చేత సంతకాలు సేకరించారు. వెరిఫికేషన్ చేయించుకున్న నిర్వాసితులకు ఈనెల 30న పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయంలో చెక్కుల పంపిణీ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

### మల్లన్న సేవలో దేవదాయశాఖ కమిషనర్



మల్లన్న దర్శనానికి వెళ్తున్న కమిషనర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివారి అమ్మవార్లను రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం ఆలయం వద్దకు విచ్చేసిన కమిషనర్‌కు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

# మట్టి పరీక్ష.. భూమికి రక్ష

- ప్రతి ఆర్బీకే పరిధిలో భూసార పరీక్షలు
- భూసాంద్రతను అనుసరించి ఎరువులు వాడుకునే అవకాశం
- తగిన మోతాదులో వాడకంతో పంటల దిగుబడి మెరుగు
- నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో 8,738 మట్టినమూనాల సేకరణ

జూపాడుబంగ్లా: రైతులు ఇష్టానుసారంగా రసాయనిక ఎరువులు వాడటం, పురుగు మందులు పిచికారీ చేయటం వల్ల భూసాంద్రత లోపించి పంటల దిగుబడి క్రమేణా తగ్గుతుంది. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని పంటల దిగుబడికి కారణమైన భూసారం వివరాలను తెలుసుకొని లోపాలను సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది. టీడీపీ పాలనలో భూసార పరీక్షలు చేయించుకోవాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల పొలాల్లో మట్టిని సేకరించి భూసార పరీక్షలు చేయించి ఫలితాల ఆధారంగా ఎలాంటి రసాయనకి ఎరువులు వాడాలో రైతులకు తెలియజేస్తున్నారు.

**8,738 మట్టి నమూనాల సేకరణ**

నందికొట్కూరు నియోజకవర్గంలో 153.750 ఎకరాలు సాగు భూమి ఉంది. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పగిడ్యాల, మిడుతూరు,కొత్తపల్లి,పాములపాడు మండలాల్లో 5,651 నమూనాలను ఆర్బీకేల ద్వారా సేకరిస్తున్నారు. అలా గే శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలు గోడు, బండిఆత్మకూరు మండలాల పరిధిలో 3,087 నమూనాలు సేకరిస్తున్నారు.ఆసక్తి ఉన్న రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేయించుకుంటే వారి మట్టి నమూనాలు సేకరించి ల్యాబుకు పంపుతారు.



తాటిపాడు గ్రామంలోని పొలంలో మట్టినమూనా సేకరిస్తున్న ఆర్బీకే వీఏఏ అబ్దుల్లా

**భూసార పరీక్షలు ఎందుకు చేయించుకోవాలంటే**

రైతులు సాగుచేసే పంటలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులు ఎంత మోతాదులో వాడుకోవాలో తెలుస్తుంది. సాగుకు అనుకూలంగా లేని (చౌడు, ఆమ్ల ) భూములను గుర్తించి వాటిని పంటల సాగుకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంటుంది. భూమి ఎలాంటి పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది, ఎంత మోతాదులో ఎరువులు వాడుకోవాలి అనే విషయాలు తెలుసుకోవచ్చు. అలాగే సమతులపద్ధతిలో ఎరువులు వాడుకోవటం వల్ల పెట్టుబడి తగ్గి దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుంది.

**ఎరువుల వాడకం**

ఎరువులు మూడు రకాలు కాగా సేంద్రీయ ఎరువులు, రసాయనిక ఎరువులు, జీవన ఎరువులు. వాటిల్లో రసాయనిక ఎరువులు భూమిలో సహజంగా ఉండాల్సిన నత్రజని, భాస్వరం, పొటాషియం 4:2:1 నిష్పత్తిని అనుసరించి వేసుకోవాల్సి ఉంటుంది. సేంద్రీయ ఎరువుల్లో స్థూల సేంద్రీయ ఎరువు పశువుల ఎరువు, కంపోస్టు, చిక్కటి సేంద్రీయ ఎరువులు వేపపిండి, ఆముదపు పిండి(నూనె చెక్కలు, పిండిఎరువులు) సేంద్రీయ ఎరువులైన జీలుగ, ఆవులు, బర్రెల, గొర్రెల పేడను, కంపోస్టు ఎరువు, వేపపిండి, ఆముదపు పిండి ఖరీఫ్ ప్రారంభానికి నాలుగు వారాల ముందు పొలంలో చల్లుకొని కలియదున్నుకోవాలి. భూసార పరీక్షలు చేయించుకొన్న తర్వాత వాటిల్లో నత్రజని, భాస్వరం, పొటాషియం, నిష్పత్తిని అనుసరించి వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి సరైన సమయంలో రసాయనిక ఎరువులను పంటలకు వేసుకోవాల్సి ఉంటుంది. అలాకాకుండా ఇష్టానుసారంగా రసాయనిక ఎరువులు వినియోగిస్తే భూసాంద్రత దెబ్బతిని పంటల దిగుబడి లోపిస్తుంది. రసాయనిక ఎరువులు, సేంద్రీయ ఎరువుల నిష్పత్తి 60:40గా ఉండేలా చూసుకోవాలి.

**భూసాంద్రత వివరాలు తెలుస్తాయి**



ప్రతి ఏటా రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. భూసార పరీక్షల వల్ల భూమిలో ఉండాల్సిన నత్రజని, భాస్వరం, పొటాషియం శాతం తెలియటంతో పాటు సూక్ష్మపోషకాల నిష్పత్తి తెలుస్తుంది. దాన్ని అనుసరించి నిర్ణీత మోతాదులో రసాయన ఎరువులు వాడుకోవచ్చు. ఎరువులు ఇష్టానుసారంగా వాడటం వల్ల భూసాంద్రత లోపించి పంటల దిగుబడి తగ్గుతుంది. గతంలో భూసార పరీక్షలు చేయించుకోవటం కష్టంగా ఉండేది. ప్రస్తుతం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులు వారి పొలాల్లోని మట్టిని సేకరించి ల్యాబుకు పంపిస్తే చాలు వాటి వివరాలను విశదీకరించి రైతులకు తెలియజేయటం జరుగుతుంది.

– విజయశేఖర్, ఏడీఏ, నందికొట్కూరు

### ఆర్బీకేల ఆకస్మిక తనిఖీ

పాములపాడు: మండలంలోని మిట్టకందాల, మద్దూరు, వాడాల గ్రామాల్లోని ఆర్బీకే లను ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి నమూనాల సేకరణ, కౌలు కార్డులు ఎంత మంది రైతులకు అందజేశారని ప్రశ్నించారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ స్థాయి టాస్క్‌ఫోర్స్ అప్రమత్తంగా ఉండి నకిలీ పురుగు మందులు, ఎరువుల విక్రయాలపై నిఘా ఉంచాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.

### గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

పాములపాడు: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ శాఖాధికారి కృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల బదిలీపై నన్నూరు నుంచి ఇక్కడకు వచ్చిన ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గ్రంథాలయాలను అందరికి ఉపయోగపడేలా తీర్చి దిద్దుతోందన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని సూచించారు.

## భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి

మహానంది: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి తెలిపారు. మహానంది సమీపంలోని తిమ్మాపురం రెవెన్యూ పరిధిలోని భూముల్లో జరుగుతున్న రీ సర్వే పనులను బుధవారం జేసీ నిశాంతి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రీ సర్వే పనుల్లో ఎక్కడా అవకతవకలు లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ, సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి దగ్గరుండి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, సర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ బి.కామేశ్వరరెడ్డి, సిబ్బందితో మాట్లాడారు. అంతకు ముందు జేసీ నిశాంతి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

**జగనన్న భూ రక్ష సర్వేకు శ్రీకారం**

పగిడ్యాల: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా డిప్యూటీ తహసీల్దార్ మురళి, సర్వేయర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం నెహ్రూనగర్‌లో పూజ చేసి రోవర్ పరికరంతో భూ సర్వేకు శ్రీకారం చుట్టారు. సర్వేయర్ మాట్లాడుతూ మండలంలో ముర్వకొండ గ్రామ సర్వే చేపట్టాలని మొదట రికార్డులు వచ్చాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో సర్వే చేసేందుకు మూ డు టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు నవీన్, తేజశ్విని, కుసుమంత్, వీఆర్ఏలు పాల్గొన్నారు.



మహానంది వద్ద రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ నిశాంతి

## పేదలకు వరం సీఎం సహాయనిధి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: రాష్ట్రంలోని నిరుపేదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని, సీఎం సహాయనిధి పేదలకు వరమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, సున్నిపెంట మండలాల్లో 15 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 32.60 లక్షల చెక్కులను బుధవారం నంద్యాల పట్టణంలోని ఎమ్మెల్యే శిల్పా నివాసంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఏ ముఖ్యమంత్రి చేయలేనన్ని సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేస్తూ పేదల మనసులో చిర స్థాయిగా నిలిచిపోతున్నారన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో రాని బీమా, సీఎంఆర్ఎఫ్ పథకాల లబ్ధి శ్రీశైలం నియోజకవర్గానికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు రిటైర్డ్ ఉద్యోగుల సన్మానం**

మహానంది దేవస్థానంలో నలభై ఏళ్లపాటు పనిచేసి పదవీవిరమణ పొందిన రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని బుధవారం రాత్రి టీటీడీ కళ్యాణ మండపంలో సన్మానించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు మునగనూరు శివయ్య, సాంబిరెడ్డి, స్వామిరెడ్డి, రాజమ్మ, తదితరులు పీఆర్సీ అరియర్స్ మంజూరు చేసిన ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఇసుకవాగు పరిశీలన

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామశివారులోని ఇసుకవాగుపై వంతెన నిర్మించేందుకు రోడ్లు, భవనాలశాఖ డీఈ సురేష్, ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఈ నాగరాజు బుధవారం వాగును పరిశీలించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ త్వరలో టెండర్లు పూర్తిచేసి ఇసుకవాగుపై వంతెన నిర్మాణం పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాశం, దేవసహాయం, నారాయణరెడ్డి, చెంచిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండండి

మిడుతూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ గౌడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో మలేరియా కేసులు వచ్చినట్లు నిర్ధారణ కావడంతో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జ్వరంతో ఉన్న రోగులకు రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రంగస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు ఏసేపు, రామతులశమ్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి కృష్ణారెడి పాల్గొన్నారు.

### అక్రమ కట్టడాలను ఆపండి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో చేపడుతున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలుపుదల చేయాలని మండల తహసీల్దార్ రాజేంద్రసింగ్, పంచాయతీ కార్యదర్శి బాలూనాయక్, జలవనరులశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు ఆదేశించారు. అక్రమ కట్టడాల నిలుపుదలకు, భూ ఆక్రమణల, ప్రభుత్వ గృహాల ఆక్రమణలను నిలుపుదల చేసేందుకు సచివాలయ సిబ్బంది ముందుండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశాల మేరకు రెవెన్యూ, గ్రామపంచాయతీ, జలవనరుల శాఖ, పోలీసు శాఖల సమన్వయంతో బుధవారం ఒక కమిటీని ఏర్పాటు చేశారు. వీరు గ్రామంలో సమగ్ర సర్వే చేపట్టనున్నారు. కార్యక్రమంలో జలవనరులశాఖ డీఈఈ మురళీబాబురావు, ఎస్ఐ గంగయ్యాయాదవ్ తదితరురు పాల్గొన్నారు.

### రైతు బజార్ పరిశీలన

ఆత్మకూరు: పట్టణంలోని మార్కెట్ యార్డు లో రూ.65లక్షలతో నిర్మించిన రైతు బజారును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏసురత్నం కోరారు. బుధవారం రైతు బజార్‌ను పరిశీలించారు.

### జగనన్న సురక్షపై అవగాహన

శ్రీశైలంప్రాజెక్ట్: జగనన్న సురక్ష పేదప్రజలకు వరమని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి ఎంఏ.రజాక్, ఎంపీడీఓ మోహన్ అన్నారు. జగనన్న సురక్షపై వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లతో బుధవారం స్థానిక కృష్ణవేణి కల్యాణ మండపంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అర్హత ఉండి ఏదేని సాంకేతిక కారణాల వలన అందుకోలేని వారి పేర్లను జగనన్న సురక్ష పోర్టల్‌లో నమోదు చేసి, వారికి టోకెన్ ఇవ్వాలన్నారు. త్వరలో నర్వహించబోయే జగనన్న సురక్ష క్యాంప్‌కు టోకెన్లు పొందిన వారిని తీసుకు వచ్చి వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి బాలూనాయక్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జింకా గుండయ్య యాదవ్, మండల నాయకులు భరత్‌రెడ్డి, టీఎండీ రఫీ, ఆసాది ప్రవీణ్ దివ్యతేజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఏ రజాక్

## సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని నాగలూటి గ్రామ సచివాలయ పరిధిలోని పైపాలెం, నాగలూటి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లుతో కలిసి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల వారు అట్టడుగు స్థాయిలో ఉండేవారన్నారు. జగనన్న సీఎం అయ్యాక వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. పేదల అభివృద్ధిని చూసి ఓర్వలేని చంద్రబాబు, పచ్చ మీడియా సంక్షేమ పథకాలపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సమస్యల పరిష్కారానికి ఆదేశం**

గ్రామాల్లో డ్రైనేజీ, మైనార్టీ కాలనీలో తాగు నీటి సమస్య, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, పొలం ఆన్‌లైన్‌లో నమోదు, హౌసింగ్ మంజూరు, తదితర వాటిని పరిష్కరించాలని గడప గడప కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. పైపాలెంలో గ్రామంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి నైతికవిలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సల్కోటి గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి, ఇనాయతుల్లా, మర్రి రామేశ్వరుడు, పుల్లయ్య, జాన్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు తొలిఏకాదశి వేడుకలు

మహానంది: మహానంది ఆలయంలో గురువారం తొలిఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మ మహేశ్వరరెడ్డితో కలిసి బుధవారం ఆలయ ప్రాంగణంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉపప్రధాన అర్చకులు వనిపెంట జనార్ధనశర్మ, ముఖ్య అర్చకులు రాజమాణిక్యశర్మ, ప్రకాశంశర్మల ఆధ్వర్యంలో ఆలయ శుద్ధి పూజలు చేశారు. తొలిఏకాదశి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు, తిరుమంజనం, ఫలముల నివేదన సమర్పణ పూజలు ఉంటాయని ఈఓ తెలిపారు.

### కేసుల నమోదు

కొత్తపల్లి: మహిళా వలంటీర్‌పై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హుస్సేన్ బాషా బుధవారం తెలిపారు. మండలంలోని ఎం.లింగాపురం గ్రామంలోని బీసీ కాలనీలో వలంటీర్ విధులు నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్ సరోజపై రైతుభరోసా డబ్బుల విషయంలో గొడవపడి రక్తగాయలు అయ్యేల కొట్టిన నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. దాడికి యత్నించిన మద్దిలేటి, హుస్సేనమ్మ, రాజేశ్వరి, భారతిలపై వలంటీర్ సరోజ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఈనెల 10వ తేదీన మండలంలోని శివపురం గ్రామంలో కొలనుభారతి దేవి అమ్మవారి ఆర్చీ నిర్మాణ విషయంలో గ్రామానికి చెందిన లింగస్వామి గౌడ్‌పై కొంత మంది దాడి చేశారు. ఈ ఘటనలో ప్రసాద్, రాజశేఖర్ గౌడ్, కొలమయ్యగౌడ్, జయచంద్ర మోహన్‌తో పాటు మరో 17 మందిపై లింగస్వామి గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### లక్ష్యాలను నీరుగారిస్తే క్షమించం



ఏపీఎం రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, అధికారులు

మహానంది: పేదల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, ప్రభుత్వ లక్ష్యాలను నీరుగారిస్తే క్షమించేది లేదని బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి హెచ్చరించారు. బండిఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ వాసుదేవగుప్త ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ఒకటో తేదీ నుంచి జరగబోయే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసి మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఉన్నతి పథకంలో లక్ష్యాలను అధిగమించినందుకు వైకేపీ ఏపీఎం రాజశేఖర్‌రెడ్డిని సన్మానించారు. హౌసింగ్ ఏఈ సుంకిరెడ్డి, పీఆర్ ఏఈ వెంకటయ్య, జెడ్పీటీసీ బారెడ్డి రామతులశమ్మ, మండల ఉపాధ్యక్షులు రాగాల వెంకటరమణ, ముంతల మధు రాణి, సొసైటీ చైర్మన్ పరమటూరు శివలింగం తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపులి సంచారంపై ఆందోళన వద్దు

కొత్తపల్లి: రెండు రోజుల నుంచి బలపాలతిప్ప గ్రామంలోని ఆవులమందపై దాడి చేసిన పెద్దపులి గ్రామంలోకి రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని గ్రామస్తులు ఆందోళన చెందవద్దని ఆత్మకూరు ఎఫ్ఆర్ఓ పట్టాభి, యాంటీ పోచింగ్ స్క్వాడ్ సుభాష్ బుధవారం తెలిపారు. గత రెండు రోజుల నుంచి గ్రామంలో ఆవుల మందపై దాడి చేసి రెండు దూడలను బలిగొన్న పెద్దపులి మళ్లీ రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంగళవారం రాత్రి నుంచి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామస్తుల సహకారంతో పెద్ద శబ్దాలు, టపాసులు పేల్చడం జరిగిందన్నారు. అలాగే ముందస్తుగానే రిస్క్యూ వాహనాన్ని కూడా అక్కడే ఉంచామని చెప్పారు. వారం రోజుల దాకా గ్రామం చుట్టూ ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి గ్రామంలోకి పెద్దపులి రాకుండా చేస్తామన్నారు. మంగళవారం రాత్రి అటవీ ప్రాంతంలోని చెట్లకు పులిజాడ కోసం కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడిచారు. కార్యక్రమంలో స్థానిక ఎఫ్ఎస్ఓ నాగేశ్వరరావు ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.



ట్రాప్ కెమెరా ఏర్పాటు చేస్తున్న ఫారెస్టు సిబ్బంది

## మైనార్టీలకు అండగా జగనన్న ప్రభుత్వం



కరపత్రాలను చూపుతున్న ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షుకూర్

నందికొట్కూరు రూరల్ : రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటూ వారిని అన్ని రకాలుగా ఆదుకున్న నాయకులు నాడు వైఎస్సార్ నేడు ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ షుకుర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో హర్ దిల్ మే వైఎస్సార్– హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమంలో భాగంగా ఆయన మార్కస్ మసీదులో మత పెద్దలు, ముస్లింలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన 4 శాతం రిజర్వేషన్లతో ఎంతో మంది ముస్లిం యువత ఉన్నత చదువులు చదువుకుని నేడు ఉన్నతమైన హోదాల్లో ఉన్నారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగనన్న కూడా మైనార్టీలకు మంచి చెయ్యాలనే ఉద్దేశంతో విద్య, వైద్యం, సంక్షేమంతో పాటు రాజకీయాలలో కూడా మంచి పదవులు ఇస్తూ వారికి పెద్ద పీట వేస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వారికి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీదు ఇమామ్ సిరాజ్‌ఖాన్, రిటైర్డ్ ఎంపీడీఓ రియాజుద్దీన్, ఖాజాహుసేన్, తనవుల్లా తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ

మహానంది: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బండిఆత్మకూరు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. తహసీల్దార్‌గా బుధవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

### నిస్వార్థ సేవతోనే గుర్తింపు

జూపాడుబంగ్లా: ఉద్యోగులు నిస్వార్థంగా విధులు నిర్వర్తించినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. బదిలీపై వెళ్లిన 80బన్నూరు వీఆర్వో శ్రీనివాసులును బుధవారం సన్మానించారు. టీడీ నాగన్న, సీనియర్ అసిస్టెంటు శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

## 'శ్మశాన వాటిక కబ్జా చేశారనడం అవాస్తవం'

పాములపాడు: మండలంలోని పెంచికల పల్లి గ్రామంలో దళితుల శ్మశాన వాటికను కబ్జా చేశారనడం అవాస్తవమని ఎల్లగౌడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్వేనెంబరు 651లో నాకుటుంబ సభ్యులకు 2.44 ఎకరాల విస్తీర్ణంలో పొలం ఉందన్నారు. బీసీ శ్మశాన వాటికకు 7 సెంట్లు, ఎస్సీ శ్మశాన వాటికకు 4 సెంట్లు స్థలాన్ని వాడుకుంటున్నారని, అలాగే గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి(బీటీ)కి సైతం 24 సెంట్లు వాడుకోవడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని మండల సర్వేయర్ కొలతలు వేసి నిర్ధారించి ధ్రువీకరణ పత్రం కూడా ఇచ్చారన్నారు. అయినప్పటికీ తనను టార్గెట్‌చేస్తూ రాజకీయంగా దెబ్బ తీయడానికి దళిత సంఘాల నాయకులు ధర్నాలు చేస్తూ, సోషల్ మీడియాలో ప్రసారాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు మహ్మద్‌గౌస్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు శంకర్‌గౌడు, నాయకులు ప్రవీణ్, శ్రీనివాసులు గౌడు, గోవిందగౌడు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో ఎల్లగౌడు, వైఎస్సార్‌సీపీ నాయకులు